# పందిట్లో పెళ్లవుతున్నది

## ఆరుద్ర

అసలు పేరు భాగవతుల శివశంకర శాస్త్రి. సాహిత్య ప్రక్రియలలో ఆయన స్పృశించని ప్రక్రియ లేదు. డిటెక్టివ్ కథలు, కవితలు, కౌబాయ్ సినిమాలు, అనేక సాంఘిక పౌరాణిక సినిమాలకు రచనలు చేశారు. వేలాది సినిమా పాటలు రాసి మెప్పించారు. ఇవన్నీ ఒక ఎత్తు. సమగ్రాంధ్ర సాహిత్యం ఒక ఎత్తు. అనేకానేక వ్యాస పరంపరలు, రాముడికి సీత ఏమవుతుంది, గుడిలో సెక్స్ లాంటి పలు రచనలు చేశారు. అర్ధ శతాబ్ది పాటు నిర్విరామంగా రకరకాల రచనలు చేశారు. ఆరుద్ర ఒక విశ్వవిద్యాలయం. తెలుగు వారికి యిష్టమైన ఆధునిక రచయిత ఆరుద్ర. ఈ పండుగ పర్వంలో ఆరుద్ర కథ అందించడానికి ఆనందిస్తున్నాం.

పెళ్ళివారి ఇంటి ముందు మోటారు సైకిల్ ఎర్ర గుర్రం ఆగింది. వెనుక సీటు మీద కూర్చున్న ఇన్‌స్పెక్టర్ వేణు దిగాడు. అతడు సాధారణ మఫ్టీ దుస్తుల్లో ఉన్నాడు.

"మళ్ళా ఎప్పుడు రమ్మన్నారు?" అని సైకిల్ తోలుతున్న సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రం అడిగాడు.

"రానక్కర్లేదు. ఇంక ఇరవై నాలుగు గంటలసేపు నేను ఇన్‌స్పెక్టర్ వేణుని కాను. హత్యో, అంతకన్నా పెద్ద కేసో అయితేగాని నాకు కబురు పెట్టకు, అసలు నేనీ ఊళ్ళో ఉన్నానని మరచిపో" అని చెప్పి వేణు పెళ్ళి పందిట్లోకి వెళ్ళాడు.

నవ్వుకొని సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రం - ఎర్రగుర్రం కళ్ళాన్ని వదలి కదిలిపోయాడు.

వేణు పెళ్ళి పందిట్లోకి రావడం అతని భార్య రుక్కు చూసింది. ఆమెకి అమితానందం అయింది. పెళ్ళి కూతురు తండ్రి పెరుమాళ్ళు మరీ సంబరపడ్డాడు.

"వాయించండోయ్, భజంత్రీలు" అని పురోహితుడు కేక వేశాడు.

పెళ్ళి పందిరి కోలాహలంగా ఉంది. బాజాలు, చిన్నపిల్లల బాకాలు, పందిట్లో ఉన్న పెద్దవాళ్ళ సంభాషణలు, పెళ్ళి పీటల వెనక కూర్చున్న ఓ యాభై మంది ఆడవాళ్ళ మాటలు, బ్రాహ్మణుల మంత్రాలు అన్నీ కలసి ఒక చక్కటి ఆనందం, అతి వింత వాతావరణం వెల్లివిరుస్తున్నది.

### హిందీ హైకూ

తెలుగు అనువాదం: పెన్నా శివరామకృష్ణ

**తొలకరి :**

నింగి తన మూలాలను చాచింది
నేల మీదికి

-శ్రీకాంత్ వర్మ

**సీతాకోక చిలుకలు :**

పువ్వు నుంచి పువ్వుకు ఎగురుతూ
వసంతుడి ప్రేమలేఖలు

-సర్వేశ్వర్ దయాళ్ సక్సేనా

**సిమెంటు సరస్సు :**

భారీ లోహ హంసలు ఈదుతూ
రెక్కలు చాచి ఎగిరిపోయాయి.

-అశోక్ వాజపేయి

ఒక బ్రాహ్మణుడు అక్షింతలు, మంగళ సూత్రం పట్టుకుని మగవాళ్ళ మధ్య తిరుగుతున్నాడు. పెద్దలు మంగళసూత్రాన్ని తాకి, అక్షింతలు పుచ్చుకుంటున్నారు.

"బాబూ అక్షింతలు" అన్నాడు బ్రాహ్మణుడు. ఆలోచనా సాగరంలో నిమగ్నుడైన ఇన్‌స్పెక్టర్ వేణు ఇది వినిపించుకోలేదు. ఒకటికి రెండుసార్లు బ్రాహ్మణుడు హెచ్చరించాక, వేణు ఈ లోకంలోకి వచ్చి, "ఏమిటి?" అన్నాడు. ఇచ్చిన అక్షింతలు పుచ్చుకున్నాడు.

ఇటువంటి శుభసమయాలలో దొంగలు, దొంగతనాలు, ఖూనీలు, ఖూనీకోరులు, నేరాలు, మోసాలు మొదలైన వాటినన్నిటినీ హాయిగా కొంతసేపయినా మరచిపోవచ్చు. అందుకే వేణు ఆదమరచి పూర్వ స్మృతుల్ని తలపోసుకుంటూ, ఆలోచనా నిమగ్నుడైనాడు.

ఆడవాళ్ళవైపు ఒకరు అక్షింతలూ, మంగళసూత్రం తిప్పారు. ముత్తైదువులు గుడిలో పూజారి శఠగోపం

## ఆణిముత్యాలు

తాకించీ తాకించనట్లంత బులబుల్లాగా మంగళ సూత్రాన్ని తన కంఠం చుట్టూ ఒకసారి పెట్టుకొని, అక్షింతలు అందుకుంటున్నారు. అమ్మలక్కల మధ్య కూర్చున్న ఇన్‌స్పెక్టర్ వేణు భార్య రుక్కు కూడా అలాగే చేసి అక్షింతలు అందుకొన్నది.

ఆమె ఆనందంగా ఉంది. భార్యా భర్తలిద్దరూ బంధువుల ఇంటి పెళ్ళికి వచ్చారు. భర్తకి ఒక మూడు గంటలసేపయినా ఉద్యోగపు గొడవలూ, బెడదయినా లేకుండా చేసినందుకు ఆమె అమితానందం పొందింది.

"వాయించండోయ్, భజంత్రీలూ" అని మళ్ళా పురోహితుడు కేక వేశాడు. మంగళ వాద్యాలు చెలరేగినయ్. భజంత్రీలకు కూడా పెళ్ళి మంత్రాలన్నీ తెలుసునేమో! ఎన్ని పెళ్ళిళ్ళకు వాయించారో ఏ ఏ ఘట్టాలలో ఏ ఏ విధంగా వాయించాలో, ఏ ఏ మంత్రాలు చదువుతున్నప్పుడు ఏ ఏ వాయిద్యాలకి ప్రాముఖ్యం ఇవ్వాలో భజంత్రీలకు బాగా తెలుసు. మంత్రాలు చదువుతున్న పురోహితుడు "మాంగల్యం తంతునానేన..." అని సూత్రధారణ మంత్రం చదువుతూ ఉండగా డోలు, రండోలు దురిత కాలంలో చెలరేగినయ్.

పెళ్ళికి వచ్చిన ఆడా, మగా లేచి, అక్షింతలు వేయడానికి కుడిచేతులు ముందుకు చాచారు. ఫోటోగ్రాఫర్లు ఫ్లాష్ బల్బులతో బొమ్మలు తీస్తున్నారు.

పీటలమీద పెళ్ళికూతురు కుడి మోకాలుమీద తల వాల్చుకొని, సిగ్గుతో కూర్చుంది. ఆమె వెనుక నుంచున్న పెళ్ళికూతురు తల్లి, పెళ్ళి కుమారుడు తల్లి, మరికొంత మంది ముత్తైదువులు పెళ్ళి కుమారునికి సహాయంగా నుంచున్నారు. మొగలి రేకులు కుట్టి అల్లిన పొడుగాటి వాలుజడను ఒకరు ఎత్తి పట్టుకున్నారు. వధువు మెడమీద ఉన్న మధుపర్కం చెంగుని కొంచెం కొంచెం కిందకు సర్ది, చోటు చేశారు. పెళ్ళికుమారుడు పెళ్ళికుమార్తె మెడమీద మూడు ముళ్ళు వేశాడు. అందరూ అక్షింతలు జల్లారు. ఫ్లాష్ బల్బులు వెలిగినయ్.

అక్షింతలు జల్లటానికి లేచిన వాళ్ళందరూ కూచుంటున్నారు. సాంప్రదాయసిద్ధంగా వాయించవలసినది వాయించేశాంగదా అని, భజంత్రీలు సినిమా పాటల్లోకి దిగారు. ఇక బయటకు కదులుదామని వేణు లేచాడు.

పెళ్ళికుమార్తె పక్కన నిలబడ్డ ఆమె తల్లి, కూతురు జడని యదాలాపంగా చూసి, ఒక్కసారి గతుక్కుమంది. అయినా ఏమి తొణక్కుండా భర్తని చాటుగా పిలిచి, ఏదో చెప్పింది. అతడు కూడా నివ్వెరపడి, భావాలను మనసులోనే అదిమిపెట్టుకుని, అక్కడనుంచి కదిలాడు.

పందిట్లోనున్న వేణుని సమీపించాడు. "అబ్బాయ్, వేణు మాట" అని, పెరట్లోకి తీసుకెళ్ళాడు. అక్కడ చెప్పాడు. "పెళ్ళికూతురు జడనున్న నాగరం కనిపించడం లేదు" అని.

"కింద పడిపోయిందేమో వెతకండి" అన్నాడు వేణు.

"లేదు. పీటల మీద కూర్చున్నప్పుడు జడనే ఉందట. మా ఆవిడ చెప్పితే, నేనూ నీలాగే కిందపడిపోయిందేమో వెతకమన్నాను" అన్నాడు పెరుమాళ్ళు.

"దొంగతనమేనంటావా, బాబాయ్?"

"సందేహం లేదు. నువ్వు పరిశోధించి, దొంగని పట్టాలి" అన్నాడు పెరుమాళ్ళు.

"నాగరం ఏమాత్రం చేస్తుంది?"

"చాలా విలువైనది. వజ్రాలు తాపడం చేసిన నాగరం. పదిహేను వేలు చేస్తుంది."

"జడ ఎవరు వేశారు? నాగరం ఎవరు పెట్టారు?" అన్నాడు వేణు.

"ఏమో.. అవేం నాకు తెలియదు. మీ పిన్నమ్మ నడుగు. నువ్వు మట్టుకు బంధువులెవర్నీ ప్రశ్నించ కూడదు. దొంగతనం జరిగినట్టే తెలియనివ్వకూడదు" అన్నాడు పెరుమాళ్ళు.

"స్వర్గానికెళ్లినా సవతిపోరు తప్పదన్నట్టు- శుభమా అని పెళ్ళికొచ్చినా, నాకీ అపరాధ పరిశోధన తప్పేటట్టు లేదు" అనుకొన్నాడు ఇన్‌స్పెక్టర్ వేణు. అయితే తన భావాలను బయటకు చెప్పలేదు.

"బాబ్బాబు నీకు పుణ్యముంటుంది. నీ తెలివి తేటలన్నీ వినియోగించి, ఎలాగైనా దొంగని కనిపెట్టు గాని, అభాసు చెయ్యకు. గప్‌చుప్‌గా రెండో కంటివాడికి తెలియనియ్యకుండా దొంగని పట్టాలి- ఎలా పడతావో గాని, జరుగుతున్నది శుభకార్యం. ఈ సంగతి పైకి పొక్కిందా, అందరినీ ప్రశ్నించావా- నా పరువు ప్రతిష్ఠలు పోతాయి" అన్నాడు పెళ్ళికూతురు తండ్రి పెరామాళ్ళు.

'చచ్చిన చావొచ్చిందే!' అనుకొన్నాడు వేణు.

బంగారపు పని చేసేవాడికి గంగ్రగొడ్డలి ఇచ్చి, కాసుల పేరు చేయమంటే ఎలా చేస్తాడు? పైకి పొక్కకుండా, ఎవరినీ ప్రశ్నించకుండా ఏ డిటెక్టివైనా ఎలా అపరాధ పరిశోధన చేస్తాడు? ఎలా నేరగాడిని పట్టుకొంటాడు?

"సరే బాబాయ్! మీ ఆవిడనీ, మా ఆవిడనీ ఓసారి వచ్చి నన్ను కలుసుకోమను" అన్నాడు వేణు. పెళ్ళి కూతురు తండ్రి వెళ్ళాడు.

వేణు సిగరెట్ తీసి, ముట్టించాడు. పెరుమాళ్ళు పందిట్లోకి వెళ్ళిపోయాడు. వేణు పెరటిలోనే చెట్టు కింద నిలుచున్నాడు. క్షణాలు నిమిషాలుగా మారుతున్నాయ్. ఒక్క పది నిమిషాల కిందటే పెరుమాళ్ళు పందిట్లో ఉన్న వేణుని పెరట్లోకి పిలుచుకొచ్చి, ఈ దొంగతనం వార్త చెప్పాడు.

సిగరెట్ ఘాటుగా పీల్చి, వేణు గడచిన పదిహేను నిమిషాలనీ జ్ఞాపకం చేసుకొన్నాడు. ఆ పదిహేను నిమిషాలలోనే వేల రూపాయల విలువగల వస్తువు దొంగిలించబడింది. పట్టపగలు! పెళ్లి పందిట్లో!

దొంగిలించినవాడు ఎంత సాహసి అయి ఉండాలి? బందిపోటు దొంగలు కూడా ఈ దొంగముందు దిగ దుడుపు అయిపోతారు. నిజమే, ఈ దొంగ సామాన్యమైన దొంగ కాదు. ఇతణ్ణి పట్టుకోవాలంటే వేణు తన అనుభవాన్నీ, చాకచక్యాన్నీ పూర్తిగా ఉపయోగించాలి.

పెళ్ళి పందిట్లో శుభకార్యం జరుగుతూ ఉండగా దొంగతనం జరిగితే ఆ సంగతి రమారమి చాలామంది గుర్తించరు. గుర్తించినా, అభాసు అవుతుందని పైకి చెప్పరు. చెప్పినా, దర్యాప్తు జరిగేలోగా దొంగ పారి పోవచ్చు. ఆ తరువాత 'సంతలో చింతపండు' అని పెళ్ళికొచ్చిన వందలాది బంధువుల్లో ఎవరినని పోలీసు వాళ్ళు అనుమానిస్తారు? అనుమానించేలోగా ఆ సరుకుని కరిగించేయవచ్చు. కైంకర్యం చేయవచ్చు.

ఇన్ని ఆలోచించుకునే ఈ దొంగ ఇంత సాహసం చేసి ఉంటాడు. ఇప్పుడు ఈ పెళ్ళికొచ్చిన వాళ్ళలో ఎవరినని అనుమానించడం? ఎవరు తీసి ఉంటారు? ఇలా వేణు ఆలోచించాడు. గడచిన పదిహేను నిముషాలనీ వరసగా జ్ఞాపకం చేసుకొన్నాడు. ఏం జరిగినదీ ఊహించుకొన్నాడు. మూడో సిగరెట్ సగం కాలేసరికి. పినతల్లి పేరిందేవి, భార్య రుక్కు పెరట్లోకి వచ్చారు.

"చూశావుట్రా వేణూ. ఎంత ఘోరమో?" అంది పేరిందేవి.

"పొరపడ్డావేమోనమ్మా! అసలు జడకి నాగరం పెట్టారో లేదో?" అన్నాడు వేణు.

"అదేమిట్రా? నా కళ్ళారా చూశా. పీటల మీద తీసుకొచ్చి కూర్చుపెట్టేప్పుడు ఉంది."

"జడ ఎవరు వేశారు?" అని అడిగాడు వేణు.

"కృష్ణవేణి వేసింది."

"మా అమ్మా?" అని వేణు ఆశ్చర్యం పొందాడు.

"అవునండీ, అత్తగారే వేశారు. మొగలి రేకులు కుట్టి, ఆవిడ జడ వేసినట్టు ఇంకెవరూ వేయలేరు" అంది రుక్కు.

నిజమే, ఉత్త రోజుల్లోనే ఊళ్ళో ఉన్న బంధువుల ఆడపిల్లలకి తన తల్లి పువ్వులు కుట్టి జడ వేస్తుంది. ఇటువంటి శుభకార్యంలో మరీ దగ్గర బంధువుల పెళ్ళి జరుగుతున్నప్పుడు పెళ్ళికూతురికి జడ వేయకుండా ఉంటుందా?

"అయితే నాగరం పోవడం ఖాయమేనన్నమాట! ఎవరు తీసి ఉంటారు?" అన్నాడు వేణు.

"అది నువ్వు కనిపెట్టాలి గాని, మమ్మల్ని అడిగితే ఎలాగరా? పెద్ద పోలీసు ఆఫీసరువి. ఎందరెందరో దొంగల్ని పట్టుకున్నావు!" అంది పినతల్లి.

"అదేనమ్మా! బహిరంగంగా ఆలోచిస్తున్నాను. పీటల వెనకాతల ఆడవాళ్ళేగాని మగవాళ్ళెవరూ లేరు. దొంగతనం చేస్తే ఆడవాళ్ళే చేయాలి" అన్నాడు వేణు.

రుక్కుకి కోపం వచ్చింది. వేణు ఇలాగ హేతువాద బద్ధంగా ఆలోచించడం వల్ల స్త్రీ జాతినే అవమానిస్తున్నా డని ఆమె భావించింది.

"అదేంమాట! మగవాళ్ళు తీసి ఉండకూడదా? ఆ మాటకొస్తే, పెళ్ళికొడుకే దొంగతనం చేశాడేమో!" అంది రుక్కు.

"అదేవిటే- పెళ్ళికూతురే తనది కాబోతూ ఉంటే, వెధవ నాగరం ఎందుకే పెళ్ళికొడుక్కి?" అంది పేరిందేవి.

"ఎందుకో మీ అబ్బాయినే అడగండి అత్తయ్యా! పీటల మీద దొంగతనాలు ఆయనకి అలవాటే!" అంది రుక్కు.

"ఏవిట్రా నాయనా?" అంది పేరిందేవి.

"నా పెళ్ళిలో నేను ఈవిడగారి చేతి ఉంగరం దొంగతనం చేశాగా? ఇవాళ ఎత్తిపొడుస్తోంది" అన్నాడు వేణు - పాత అనుభవాలను జ్ఞప్తికి తెచ్చుకొని.

శాస్త్రోక్తంగా జరిగే కొన్ని అయిదురోజుల పెళ్ళిళ్ళలో అల్లుడు మామగారింట్లో ఏదో సరుకు దొంగతనం చేయాలి. దొరికిపోకూడదు. దాన్ని ఆడపెళ్ళివాళ్ళు తెలుసుకోలేనంత చాకచక్యంగా చేయాలి.

తన పెళ్ళిలో వేణు చాలా చాకచక్యంగా దొంగతనం చేశాడు. ఎవరూ కనిపెట్టలేదు. బహుశా ఈ పెళ్ళికొడుకు కూడా అలాగే తెలివిగా 'దొంగవేలం'కి ముందే ఈ దొంగతనం చేశాడేమో!

"మా అల్లుడు అసలు పీటలమీద పెళ్ళికే వప్పు కోలేదు. షాపులో పుస్తకాలు కొనుక్కుని బిల్లు పుచ్చుకొన్నట్టు రిజిస్ట్రార్ ముందు సంతకాల పెళ్ళి చేసుకొని, లైసెన్సు పుచ్చుకొంటానన్నాడు. లాంఛనాల ప్రకారం దొంగతనం చేస్తాడంటావా?" అంది పేరిందేవి.

"ఏం తీపు దిగతీసిందా? అచ్చట్లూ, ముచ్చట్లూ అంతే అతగాడికి సరదాయే. తన ప్రతిభ చూపెట్టడానికి తీశాడేమో!" అంది రుక్కు.

"నాకు నమ్మకం లేదు. ఇది ఎవరో పై వాళ్ళ పనే" అంది పేరిందేవి.

"సరేలేవమ్మా. పెళ్ళికొడుకు పనైతే పేచి పూచి లేదు. పైవాళ్ళ పనైతే నేను కనుక్కొంటాను."

"నీ పుణ్యముంటుంది... కనుక్కో."

"అది సరేగాని, మూడు ముళ్ళూ వేస్తున్నప్పుడు పెళ్ళికూతురు జడ నెవరు పైకెత్తి పట్టుకొన్నారు?" అని అడిగాడు వేణు.

"ఏమోరా! ఆ తొందరలో ఎవరు పట్టుకొన్నారో ఎవరికి జ్ఞాపకం ఉంటుంది?" అంది పేరిందేవి.

"పెళ్ళికూతురు వెనుక ఎవరెవరు నించున్నారు?"

"నేను వియ్యపురాలు, మరింకెవరెవరో నిల్చున్నాం. నాకు జ్ఞాపకం లేదు" అంది పేరిందేవి- జ్ఞాపకం చేసుకోవడానికి ప్రయత్నించి, విఫలురాలై.

"చూడు రుక్కూ నీకు జ్ఞాపకం ఉందేమో చెప్పు" అన్నాడు వేణు.

"నాకూ జ్ఞాపకం లేదండీ" అంది అతని భార్య.

"సరే! పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ ఇంకా పీటల మీదే ఉన్నారు. తలంబ్రాలు పోయడం జరుగుతూ ఉంటుంది. మీరిద్దరూ వెళ్ళి, చుట్టుపక్కల చూడండి. బహుశా నాగరం ఊడి, పెళ్ళికొడుకు మధుపర్కం మడతలలోనో, పెళ్ళికూతురు పైట చెంగులోనో పడి ఉంటుంది. వెతకండి" అని ఇద్దరినీ వేణు పంపిం చేశాడు.

వాళ్ళు వెళుతూ ఉండగా పిలిచి, "మా అమ్మ ఎక్కడుంది?" అని అడిగాడు.

"గాడి పొయ్యిల దగ్గర వంటపెత్తనం చూస్తోంది" అని పేరిందేవి చెప్పింది. వేణు సరాసరి వంటశాలలోకి వెళ్ళాడు. గాడిపొయ్యిలు ప్రజ్వరిల్లుతున్నాయి. కొత్త

## కనక 'స్వరాలు'

మతములను యీ అగ్నిపర్వత
ములను యెవ్వరు పేర్చినారో?
భగ్గుమంటే మానవత్వము
బుగ్గిపాలగునోయ్!
మతముకొక జాతీయ పార్టీ
కులముకొక ప్రాంతీయ పార్టీ
పుట్టి పెరిగిన దేశమెట్టుల
బాగుపడునోయి?
టెర్రరిస్టులు, సతీమాతలు
దొంగ బాబా అమ్మవారలు
సమాజానికి సోకినట్టి
మహమ్మారులు మిత్రమా!
అణువుతో బాంబులను చేసి
అధికుడని భ్రమపడేవాడును
చూపుకందని సూక్ష్మ జీవుల
చేత చచ్చెనోయ్!
కారులో ఒకడెళ్లిపోతే
బారులో ఒకడూగిపోతే
దేశభారం మోయువాడూ
బక్కరైతేనా?
పంటలన్నీ ప్రజలజేరీ
వంటలందరి నోట దూరీ
ఆకలంటూ కేకలెప్పుడు
ఆగిపోతాయో?
ఆకసానికి అంటు మేడలు
భూమిచుట్టూ తిరుగు ఓడలు
పూరిగుడిసెల నాటు పడవల
స్నేహమెప్పుడు చేయునో?
ఆశలాకసమందు తారలు
కోరికలు సంద్రాన అలలోయ్
తారలందవు, అలలు ఆగవు
బారలేయొద్దోయ్!
మూడునాళ్ళా బ్రతుకు కోసం
మోసమెందుకు? రోషమెందుకు?
శాంతి, స్నేహం, కరుణ, మమత
పంచిపెంచాలోయ్!

-అయినాల కనకరత్నాచారి

తాటిచాపల మీద వార్చి, రాశిగా పోసిన అన్నం ఆవిర్లు కక్కుతున్నది. గంగాళాలలో పులుసు మరుగుతున్నది. కృష్ణవేణమ్మ అందరిమీద అజమాయిషీ చేస్తూ, అటూ ఇటూ తిరుగుతోంది.

"అమ్మా!" అని వేణు పిలిచాడు.

"ఏం నాయనా?" అని ఆమె దగ్గరకొచ్చింది.

"మాట!" అని దూరంగా తీసుకెళ్ళాడు.

"పెళ్ళికూతురికి నువ్వేనా జడకుట్టావు?" అని అడిగాడు.

"నేనే! ఏం?" అని ఆమె ఆత్రుతగా అడిగింది.

"ఏం లేదు. నాగరం పెట్టావా?"

"పెట్టాను"

"మామూలుగా జడకి నాగరం పెడుతున్నప్పుడు అతిచిన్న పాయతీసి, అది నాగరం కొక్కెంలోంచి తీసి, జడ అల్లుతారుగా? అలాగే చేశావా?" అని అడిగాడు.

"ఏవిట్రా ఈ ప్రశ్నలు? కొంపతీసి, ఆ నాగరం గాని పోలేదు కదా?" అని ఆమె అడిగింది.

"పోయిందమ్మా" అన్నాడు వేణు.

"అయ్యో! అయ్యో! ఎంత పని జరిగింది? ఎంత పని జరిగింది? ఎలా పోయిందిరా? నేను చాలా గట్టిగా కుట్టానే!" అంది ఆమె

"ఎలా కుట్టావో చెప్పు. జడ పాయ తీసి, నాగరం లోంచి దూర్చావా?"

"లేదురా! మొగలి రేకులు కుట్టాగా? జడ పాయ నాగరంలోంచి దూర్చలేం. జడ అంతా కుట్టాక, నాగరం ఆ మొగలి రేకులమీదే కుట్టాను."

"దారం బలంగా ఉందా?" అని వేణు అడిగాడు.

"రెండు పేటలు వేసి, మరీ కుట్టా" అంది తల్లి.

"ఊఁహూ!" అని వేణు తల పంకించాడు.

"ఎక్కడ పోయింది?" అని ఆమె అడిగింది.

"మూడు ముళ్ళూ వేయడానికి ముందు ఉందట. తరువాత కనబడలేదట. అది సరేగాని, నువ్వు జడ కుడుతున్నప్పుడు ఆ గదిలో ఎవరెవరున్నారు?" అని వేణు అడిగాడు.

"ఎవరెవరా? విశాలాక్షి, నీలవేణీ, చిన్న పిన్నిగారి చిన్నమ్మా, సూరన్నగారి సుందరమ్మా- బాగా జ్ఞాపకం చేశావురోయ్. ఇది సుందరమ్మ పనే అయి ఉంటుంది. అది చిన్న చిన్న చిల్లర దొంగతనాలు చేస్తూ ఉంటుంది. జడ అల్లుతున్నంతసేపూ దాని కళ్ళు నాగరం మీదే ఉన్నాయి. విషపు చూపులూ- అదీనీ. వెళ్ళి కాఫీలూ, ఫలహారాలూ చూడవే అంటే, కదలదే" అంది తల్లి.

"ఊఁహూ!" అని వేణు తల పంకించాడు.

నిజమే. ఈ సుందరమ్మ ఒట్టి కక్కుర్తి మనిషి. ఎవరింటికేనా వెళితే, ఉత్తచేతులతో తిరిగిరాదు. అడిగో, అడక్కో ఏదో ఒక వస్తువు పట్టుకొని వెళుతుంది. ఇది సుందరమ్మ చేసిన పనే కావచ్చు.

వేణుకి తన తల్లియొక్క సూక్ష్మగ్రహణ శక్తిలో నమ్మకముంది. మనిషిని చూడగానే వాలకం కనిపెట్టే స్వభావాన్ని అతడు తల్లి దగ్గరనుంచే అలవర్చుకొన్నాడు.

ఇంతలో "అత్తయ్యా, కొట్టుగది తాళంచెవులు ఇయ్యి" అంటూ నీలవేణి వంటశాలలోకి వచ్చింది.

నీలవేణి పొడుగ్గా, చామనచాయగా ఉంటుంది. బెంగాలు సిల్కు చీర కట్టుకొని, జార్జెట్టు రవిక తొడుక్కుంది. వయసు పాతికేళ్ళు నిండకపోయినా ముచ్చట ముడివేసుకొంది. ఆ ముడి చాలా ముచ్చటగా ఉంది. చిన్నప్పుడు ఈ నీలవేణిని తనకు ఇస్తానన్నారు.

"ఎందుకే?" అని కృష్ణవేణమ్మ అడిగింది.

"అరటి గెల కావాలి. బ్రాహ్మల్లకి సంభావన ఇవ్వాలట. తాంబూలంలో అరటిపళ్ళు పెట్టాలి" అంది నీలవేణి.

కృష్ణవేణమ్మ తాళంచెవులు కొంగునుంచి విప్పడానికి తీసింది. తాళంచెవుల గుత్తి విప్పుతూండగా, "ఏం బావగారూ, వంటింట్లో చేరారు? బకాసురుడిలాగ వండినదంతా కబళించేస్తే వచ్చిన బంధువులంతా ఆకలితో మాడాలి, అత్తయ్యోయ్! మీ అబ్బాయికి కొంచెం చూసిపెట్టు" అంది నీలవేణి. "పోవే భడవా! మీ అన్నలాగ మావాడేం తిండిపోతు కాదు" అని కృష్ణవేణమ్మ తాళం చెవులు ఇచ్చింది. తీసుకొని, నీలవేణి వెళ్ళిపోయింది. వెళుతూ వెళుతూ, వేణు వంక అదోలా చూసింది.

ఆ చూపుకి అర్థం ఏమిటి?

"నన్నేగాని నువ్వు పెళ్ళాడి ఉంటే, ఎంత బాగుండేది?" అనేనా? అంతే! ఇలాంటి పెళ్ళిళ్ళలోనే అటువంటి తలపులు వస్తాయి.

"సరేనమ్మా, సుందరమ్మని అనుమానించవచ్చు. అయినా చిన్ని పిన్నిగారు చిన్నమ్మ ఎలాంటిది? అది కూడా నువ్వు జడ అల్లుతూ ఉంటే ఉందన్నావుగా?" అని వేణు అడిగాడు.

"అది వట్టి బోళా మనిషిరా! నగలూ నట్రా అంటే వల్లమాలిన సరదా అనుకో. ఊరివాళ్ళవి ఎరువు తెచ్చుకొని పెట్టుకొంటుంది. అది దొంగతనం చేసి ఉండదు" అంది తల్లి.

"ఏమో! ఎవరు చెప్పగలరు?" అన్నాడు వేణు.

"అవునులే" అంది తల్లి.

"అది సరే, మరి విశాలాక్షి ఎలాంటిది?" అని అడిగాడు.

"రామరామ... గంగిగోవు! ఉన్న నగలే అది పెట్టుకోదు" అంది తల్లి.

"ఊఁహూ!" అని వేణు తల పంకించాడు. "సరే!" అని కదిలాడు.

తన తల్లి పెళ్ళికూతురుకి జడ వేస్తూ ఉండగా, నలుగురే అక్కడ ఉన్నారు. అందులో సుందరమ్మ, చిన్నమ్మ అనుమానించదగ్గవాళ్ళు. విశాలాక్షి గంగిగోవని తల్లి చెప్పింది. నీలవేణి దొంగతనం చేయదు. ఆమె భర్త బొంబాయిలో పెద్ద ఉద్యోగస్థుడు. దొంగతనం చేసే ఖర్మేం? నిజంగా దొంగతనం చేశారని అనుమానించదగ్గ సుందరమ్మనీ, చిన్నమ్మనీ ప్రశ్నించకుండానే ప్రశ్నించాలి. వీళ్ళుగాని తీయకపోతే వేళాకోళానికి, లాంచనానికి పెళ్ళికొడుకే తీసి ఉంటాడు. సరే, ముందు సుందరమ్మని ప్రశ్నిద్దాం, అని వేణు కదిలాడు.

పెళ్ళివారిల్లంతా ఆమెకోసం గాలించాడు. ఒక గదిలో కూర్చొని, ఆమె ఎవరూ చూడకుండా లడ్డుండలు బొక్కుతూంది.

"అన్యాయం! అన్యాయం! సుందరమ్మ ఒదినా! అన్ని ఉండలూ నువ్వే తినేస్తావా? నాకు పెట్టవేం?" అన్నాడు వేణు.

ఆమె గతుక్కుమంది.

"నీకోసం అంతా గాలించాను. ఇక్కడా ఉన్నావు?" అన్నాడు.

"ఎందుకూ?" అంది భయపడుతూ.

"ఎందుకేవమిటి? నీ చేతి కాఫీ తాగుదామని. నువ్వు కాఫీ పెడితే బ్రహ్మాండంగా ఉంటుంది" అన్నాడు వేణు.

ఆమె 'బతుకు జీవుడా' అనుకొంది. "ఉండు పెట్టిస్తా!" అని ఆమె కదిలింది.

"నీ పుణ్యముంటుంది. వేగంగా కానియ్. ఈ పెళ్ళి కాఫీ తాగలేకపోయా" అన్నాడు అతడు.

"అదేమిటి? ఇవాళ కాఫీలన్నీ నేనే చేశా. మూడు ముళ్ళూ వెయ్యడం కూడా చూడకుండా కాఫీలు కాస్తూనే ఉన్నాను" అంది ఆమె.

"ఊఁహూ!" అని వేణు తల పంకించాడు. "దొంగాడా! కరవకురా" అని కొందరు గుట్టుకాస్తా చెప్పేస్తారు. తను అడిగాడా? పెట్టాడా? 'మూడు ముళ్ళూ వేస్తున్నప్పుడు నువ్వు పందిట్లో ఉన్నావా' అని అడిగితే,

## వెన్నెల ఔన్నత్యం

ఈ అమావాస్య చీకటి భూతం
ప్రకృతి కాంత అందాలను కనుమరుగు చేస్తున్నది
అయినా నిరాశా నిస్పృహలకు గురికావద్దు
ఈ చీకటి భూతం తపస్సు చేస్తూ శాశ్వత జీవనం సాగించదు
రేపు శశాంకుని వెలుగు ఒయ్యారంగా వచ్చి
ప్రకృతి మాత ఔన్నత్యాన్ని దృశ్యమానం చేస్తుంది
ఆ వెలుగు మహావృక్షాలను సుందర చిత్రపటాల వలె
రమణీయంగా కమనీయంగా చూపరుల కళ్లల్లో చిత్రిస్తుంది
విశాలంగా విస్తరించిన ధనిక వృక్షాలకే కాదు
నిరుపేద మరుగుజ్జు చెట్ల ముఖాలకు కూడా
చిట్టి చిట్టి అందాలను ఈ వెన్నెలనే అందిస్తుంది
గల గల పారే సెలయేటి ధారలకు
అందులో నవ్వుతూ నాట్యం చేసే అలలకు
ఈ వెన్నెలనే మిరుమిట్లుగొలిపే అందాలను అందిస్తుంది
నిరుపేద గుడిసెలపైన ఒళ్లు కొవ్వెక్కిన భవనాలపైన
నిష్పక్షపాతంగా సమదృష్టితోనే శశివెన్నెల ప్రసరిస్తుంది
వెన్నెల మనస్సు అంతరాల జోలికి పోదు
అది నిజాలను నిర్భయంగా దృశ్యమానం చేస్తుంది
కానీ చీకటి అలా కాదు
అది అవినీతిపరులకు దొంగ వ్యాపారులకు
దొంగ ఓట్ల కోసం ఆరాటపడే నీతితప్పిన నేతలకు
నిర్లజ్జగా సహకరిస్తుంది
వెన్నెల నిర్మల హృదయంతో చీకటి తప్పులను
బహిర్గతం చేస్తూ సౌజన్యాన్ని అందిస్తుంది
వెన్నెల ఎంత గొప్పదయినా
చీకటిని శాశ్వతంగా నిర్మూలించలేకపోతున్నది
అయినా నిరాశ వద్దు
చీకటి భూతం శాశ్వతంగా చావకపోయినా
దాని జవసత్వాలను తగ్గించే మహత్తర శక్తి
వెన్నెలకు తప్పకుండా ఉంటుంది

**-రేగులపాటి కిషన్‌రావు**

లేదని చెప్పడంలో అర్థముంది. ఇలా అడక్కుండానే ఎందుకు చెప్పింది? తన దొంగతనం కమ్ముకొందికి కాకపోతే, మరెందుకు? అని వేణు అనుకొన్నాడు.

"అదేమిటి? మంగళసూత్రధారణ అవుతూ ఉంటే, ఆశీర్వదించి అక్షింతలు వెయ్యలేదా?" అని వేణు అడిగాడు.

"లేదయ్యా! ఏ వొట్టు పెడితే ఆ వొట్టు. కాఫీలు కాస్తూనే ఉన్నా! మీ అమ్మే ఈ పనికి పురమాయించింది" అంది సుందరమ్మ.

ఈ మాత్రం భాగ్యానికి వొట్టుకూడా ఎందుకు పెట్టుకోవాలి? నిజంగా ఈమె దొంగతనం చేసి ఉంటుంది అనుకొన్నాడు వేణు.

ఈమె పెళ్ళి పందిట్లో మంగళసూత్రధారణ సమయంలో ఉంది అని రుజువు అయితే, ఈమె మీద అనుమానాన్ని దృఢంగా ధ్రువపర్చవచ్చు. అది ఎలా రుజువు అవుతుంది? ఎవరెవరు పందిట్లో ఉన్నదీ, పెళ్ళికూతురు వెనక నించున్నదీ ఎవరికి జ్ఞాపకం ఉంటుంది?

మెరుపులాగ వేణు మెదడులో ఒక ఆలోచన తట్టింది. ఇద్దరు ముగ్గురు ఫోటోగ్రాఫర్లు పెళ్ళి ఫోటోలు వివిధ కోణాలలోంచి తీశారు. ఈ బొమ్మలను చూస్తే, పెళ్ళికూతురు వెనక ఎవరెవరున్నదీ కచ్చితంగా తెలుస్తుంది.

సుందరమ్మ కలిపి ఇచ్చిన కాఫీ తాగి, వేణు ఫోటోగ్రాఫర్లను కలుసుకొన్నాడు. ఫోటోలు అర్జెంటుగా కావాలనీ, ఇవాళ రైల్లో వెళ్ళిపోయే బంధువులకి ఒక సెట్టు ఇవ్వాలనీ చెప్పాడు. రెండు గంటల్లో ప్రూఫులు ఇస్తామని చెప్పి, ఫోటోగ్రాఫర్లు వెళ్ళిపోయారు.

పెళ్ళి తతంగం అంతా అయిపోయి, పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ పీటల మీద నుంచి లేచారు. పేరిందేవి, రుక్కూ ఆ పీటల దగ్గరున్న పళ్ళాలూ అవీ తీయడం మిషమీద చుట్టూ గాలించారు. నాగరం కనబడలేదు. ఒకవేళ వేణు భావించినట్టే అదిగాని మధుపర్కాల మడతలలో పడి ఉంటే, పీటల మీదనుంచి లేచినప్పుడు కిందపడాలి - గాని, పడలేదు.

ఈ సంగతిని రుక్కు తన భర్తతో చెప్పింది. అతడు విని, "ఊహూ!" అని తల పంకించాడు.

అతడు కదలి, కొట్టు పెత్తనం చేస్తున్న నీలవేణిని కలుసుకొన్నాడు. ఆమె చాలా తొందరగా లోపలి సామానులు బయట పెట్టిస్తున్నది. నేతి జాడీలు, గోకర్ణాలూ మొదలైనవి తీసి ఇస్తున్నది. ఇద్దరు ముగ్గురు పిల్లలు వాటిని తీసుకొని వంటశాలకి వెళ్ళారు.

పైటకొంగు కుచ్చిళ్ళలో దోపుకొని, నీలవేణి చాలా పని తొందరలో ఉండడం అతడు చూసి, కదల బోయాడు.

"బావగారు ఎందుకొచ్చినట్టు, ఎందుకు వెళ్ళి పోతున్నట్టు" అని నీలవేణి నవ్వుతూ అడిగింది.

"ఎందుకొచ్చానో నీకే తెలుసు" అన్నాడతను, అదోరకంగా చూస్తూ.

"అలాగా!" అంది ఆమె సుతారంగా నవ్వుతూ.

"అవును" అన్నాడు అతడు.

సామానుల గదిలో ఇంకెవరూ లేరు, వీళ్ళిద్దరే ఉన్నారు.

"అబ్బో! నువ్వెక్కడి పోలీసు ఆఫీసరువి. ఆవలిస్తే పేగులు లెక్కపెడతావు. ఇందాక వంటశాలలో నేను చూసిన చూపుకి అర్థం పోల్చేసుకున్నావే!" అంది ఆమె ఏకాంతంలోని చనువు వల్ల ఏకవచన ప్రయోగం చేసి.

"అవును.. అందుకే వచ్చా" అన్నాడతను.

"నేను రేపే బొంబాయి వెళ్ళిపోతున్నాను" అంది ఆమె అర్థోక్తితో - 'ఈలోగా కాలాన్ని సద్వినియోగం చేసుకో' అనే అర్థం వచ్చేటట్టు.

"ఏం, నాలుగు రోజులపాటు ఉండకూడదూ? మళ్ళా ఎన్నాళ్ళకొస్తావో!" అన్నాడు వేణు.

"నాకూ ఉండాలనే ఉంది. అయినా మా ఆయన అదోరకం మనిషి. వెంటనే వచ్చేయమన్నారు. నిన్ను పెళ్ళాడినా బాగుండేది. వెధవ బొంబాయిలో పోయి పడ్డాను!" అంది ఆమె కొంచెం దగ్గరగా జరిగి.

రామాయణంలో పిడకలవేటలాగ, అపరాధ పరిశోధనలో ఈ సరసం ఏమిటనుకొన్నాడు వేణు. అక్కణ్ణుంచి కదిలి వెళ్ళిపోయాడు.

ఒక గదిలో పెళ్ళికొడుకు కూర్చొని, సిగరెట్ కాల్చుకొంటున్నాడు. వేణు అక్కడికొచ్చాడు. "రండి, రండి" అన్నాడు పెళ్ళికొడుకు, కాలుస్తున్న సిగరెట్ ఆర్పేస్తూ - పెద్దవాడు వచ్చాడు గౌరవిద్దామని.

"ఫరవాలేదు - సిగరెట్ కాల్చుకోండి" అన్నాడు వేణు.

"ఆఁ - దానికేంలెండి" అన్నాడు పెళ్ళికొడుకు.

"అది కాదు. నాలుగైదు గంటలనుంచీ పీటల మీద కూర్చొని, లాంఛనాలన్నీ చేశారు. మళ్ళా బోలెడంత తతంగం ఉంది. సిగరెట్ కాల్చుకోడానికి అవకాశం ఉండదు" అన్నాడు వేణు.

"ఇంకేం తతంగం లేదులెండి. ఉన్నా నేను ఒప్పుకోను. అసలు వీటికే ఒప్పుకోనన్నాను" అన్నాడు పెళ్ళికొడుకు.

"అదేమిటి? బువ్వంబంతి, అలకపాన్పు, దొంగ వేలం, బంతులాట ఎన్నో ఉన్నాయి!" అన్నాడు వేణు.

"నాకిష్టంలేదు" అన్నాడు పెళ్ళికొడుకు.

ఈ జవాబులో చిత్తశుద్ధిని వేణు గమనించాడు. పెళ్ళికొడుకు సంప్రదాయం కొరకు దొంగతనం చేయలేదని తేలింది.

వేణు అక్కణ్ణుంచి కదిలాడు. పక్కగదిలో చిన్నమ్మా, విశాలాక్షి ఉన్నారు. వాళ్ల మాటలని వేణు చాటు నుంచి విన్నాడు.

"ఏమే విశాలా, నా పట్టు చీర నువ్వేం చూడలేదన్నావా? నీ పెట్లోనే ఉంది" అంది చిన్నమ్మ.

"నా పెట్లోకెలా వచ్చిందే!" అంది విశాలాక్షి.

"ఏమో.. నాకేం తెలుసు? నువ్వు బూకరించేశావు గాని" అంది చిన్నమ్మ.

"నేను బూకరించాననుకో- అసలు నా పెట్టె నువ్వెందుకు తీశావు?" అంది విశాలాక్షి కోపంగా.

"ఊహూ!" అని మనసులో అనుకొని, వేణు తల పంకించాడు. వీళ్ళిద్దరూ నమ్మకస్థులు కానేకారు. ఒకరి చీర ఇంకొకరు తీసుకొని, పెట్లో పెట్టుకొన్నారు. ఆ పెట్టెని చెప్పకుండా ఇంకొకరు తెరిచారు. వీళ్ళిద్దరూ కూడా అనుమానించదగ్గవాళ్ళే. వీళ్ళు జడ అల్లుతూ ఉండగా ఆ గదిలో ఉన్నారు. మూడు ముళ్ళూ వేస్తూ ఉంటే, పందిట్లో ఉన్నారో లేదో ఫోటో చూసి కనుక్కోవాలి.

ఫోటోగ్రాఫర్లు చెప్పిన గడువు రెండు గంటలూ ఎలాగో గడిపి, తన మోటారు సైకిల్ ఎర్ర గుర్రాన్ని ఎక్కి, వేణు వెళ్ళాడు. ఫోటోలన్నీ తీసుకొన్నాడు. వాటిని పరిశీలనగా చూశాడు.

నిజమే! సుందరమ్మ చెప్పినది నిజమే. ఆమె మంగళసూత్రధారణ జరుగుతున్నప్పుడు పందిట్లో లేదు. ఏ ఒక్క ఫోటోలో ఆమె లేదు. విశాలాక్షి, చిన్నమ్మ, నీలవేణి ఉన్నారు. వీళ్ళు పెళ్ళికూతురికి చాలా దగ్గర్లో ఉన్నారు. వీళ్ళ ముగ్గుర్లో ఎవరు తీసి ఉంటారు?

ఫోటోలను మరింత పరిశీలనగా చూశాడు. ఒక చిన్న విషయం అతని కళ్ళకి కొట్టవచ్చినట్టు కనబడింది. అతడు ఆనందంతో ఒక సన్నని ఈల వేశాడు.

## ఓట్లు-చీవాట్లు

తాగుబోతు మొగుడి
గృహహింసలు సహిస్తూ
దుఃఖాన్ని దిగమింగిన పెళ్ళాం
తాగొద్దురా మగడా- అన్నందుకు
అలిగి చెలిగి గుళికలు మింగి
నురుగులు కక్కి గుడ్లు తేలవేస్తుంటే
నూటెనిమిది అంబులెన్సు
అరుచుకుంటూ వచ్చి
ఆసుపత్రికి మోసుకెళ్ళింది
వాడికి సూదులు గుచ్చుడో
కోసి పంచనామా చేసుడో
ప్రజానాయకులారా!
మద్యనిషేధం కాలించలేరా?
కాపురాలు చక్కబెట్టలేరా?
ఏరులై పారే మద్యానికి
ఆనకట్ట వేసి రండి
రేపటి ఎన్నికలలో
మా ఓటు మీకే! లేదా చీవాట్లే!!

## బొబ్బిలి నానీలు

నాయకుడ్ని చూచి
గాలి / గడగడలాడుతోంది
తనని మింగేస్తాడని
నదీ ప్రవాహంతో
బంగారు తీగెలు
ఉషోదయ / రవి కిరణాలు
దేశానికి / ఏ ప్రమాదమూ లేదు
సరిహద్దులో
సైనికుడున్నాడుగా!
పంజరంలోని చిలుక
అందరి జోస్యం
చెబుతోంది / తనకు స్వేచ్ఛ ఎప్పుడో
నాయకుడ్ని చూచి
ఆకాశం అదురుతోంది
తనని / కబ్జా చేస్తాడేమోనని
నా కవిత మాయం
ఇల్లాలి మహిమే!
కవితలతో
గడుపుతున్నానని!

-బొబ్బిలి జోసెఫ్

## ఆకాశంలో సగం

సృష్టికి మూలం ఆడది
ఆకాశంలో సగం / ఆలోచనలో సగం
ఆనందంలో సగం / అవకాశంలో సగం
తల్లి చెల్లి భార్య
రూపాలు మారినా ఇంకా ఆడదాన్ని మగాడు
తన కాళ్ల కింద నలిపేస్తూనే ఉన్నాడు
మగజాతి అహంకారమనండి
పైకి ఎన్నైనా చెబుతారు
తన కామం తీరిపోగానే చిరిగిన విస్తరిలా
స్త్రీని అవతల పారేస్తారు
పితృస్వామిక వ్యవస్థ మనది
ఇక్కడ మనుసంస్కృతి రాజ్యమేలుతోంది
ఒకరితో మాట్లాడాలన్న / బయటకు వెళ్లాలన్న
స్త్రీకి మగాడి అనుమతి తప్పనిసరి
సృష్టిలో తీయనిది ఆడది
బట్టలున్న లేకున్న
మగాడికి కనిపించేది ఆడదాని శీలమే
ఆడది కనబడగానే
మగాడికి ఆట గుర్తొస్తుంది
మృగంలా మీదపడి ఒళ్లంత గాయాలు చేస్తాడు
ఆ ఆటలో ఓడేది ఆడదే
ఈ జాతి ఎటు వెళ్తోంది?
నీలిరంగు చీకటిలో కోరికలు తీర్చుకోవడం తప్ప
స్త్రీ ఇష్టాలతో మగాడికి పనిలేదు
పడక గదిలో బట్టలు విప్పమంటారే తప్ప
మనసు విప్పి మాట్లాడమనే వారెంతమంది?
ఆడది ఒకసారి మనసు విప్పి మాట్లాడితే
మగాడికి మాటలు కరువవుతై
స్త్రీని పూజించమని చెప్పడంలేదు
కట్టుబానిసను చేయకండి
ఎక్కడైన బానిసలు రాజ్యమేలుతారా?
సుఖం కావాలంటే ఆడది కావాలి
బిడ్డను కనాలంటే ఆడది కావాలి
చాకిరీ చేయాలంటే ఆడది కావాలి
ఆడది మాత్రం ఎవరికీ అక్కర్లేదు
తన భావాలు గౌరవించట్లేదు
తన బాధల్ని పంచుకోవట్లేదు
తన కోరికలు తీర్చట్లేదు / తన ఇష్టాలతో పనిలేదు
తన ఆలోచనలతో పనిలేదు
సుఖంలో దుఃఖంలో చావులో పుట్టుకలో
తనలో తనే ఒంటరి ప్రశ్నై
జీవితానిన కష్టాలపాలు చేసుకుంటోంది
ఈ ప్రశ్నకు బదులెక్కడ?
స్త్రీని ఓ వస్తువులా చూడకండి
స్త్రీని మనిషిగ గౌరవించండి
స్త్రీకి స్వేచ్ఛనివ్వండి
స్నేహతత్వాన్ని పెంచండి
మానవత్వాన్ని పంచండి
అప్పుడు తల్లి చెల్లి భార్య
ఆడవాళ్లుగ మారుతారు

–చొక్కర తాతారావు

వెంటనే ఎర్రగుర్రం మీదనే పువ్వులమ్మే చోటుకి వెళ్లాడు. నాలుగు మొగలిపువ్వుల్ని కొన్నాడు. పెళ్లి వారింటికి వెళ్లాడు.

భోజనాలు అయ్యాక అందరూ విశ్రమించుతున్నారు. వేణు సరాసరి తన తల్లి దగ్గరకెళ్ళి, తాను కొన్న మొగలి పువ్వులు యిచ్చి, "అమ్మా! ఇవి కుట్టి, ఆ నలుగురికి జడలు వెయ్యి" అన్నాడు.

"ఏ నలుగురికి రా?" అంది కృష్ణవేణమ్మ.

"ఆ నలుగురికే. చిన్నమ్మ, సుందరమ్మ, నీలవేణి, విశాలాక్షులకి. నువ్వు పెళ్ళికూతురికి జడ వేస్తున్నప్పుడు వాళ్ళున్నారుగా?" అన్నాడు వేణు.

"ఎందుకూ?" అంది ఆమె.

"చెప్తాగా! దొంగతనం తేలిపోతుంది" అన్నాడు అతను.

ఆమె గదిలో కూర్చొని, దువ్వెన, వాసన నూనె సీసా దగ్గర పెట్టుకొని, ఆ నలుగుర్ని పిలవమని కోడలు రుక్కుని పంపింది.

"ఏం పిన్నమ్మా, పిలిచావుట?" అని చిన్నమ్మ వచ్చింది.

"ఏం లేదే! – నీకు మొగలి రేకుల జడ వేద్దామని" అంది కృష్ణవేణమ్మ.

"భలే భలే! ఉండు – వాళ్ళ నాగరం అడిగి తెచ్చు కొంటాను– కుట్టి పెడుదువుగాని, ఇంచక్కా ఇవాళల్లా పెట్టుకొంటా!" అని నగలంటే పడిచచ్చే చిన్నమ్మ సంతోషంగా బయటకు వెళ్ళింది.

కృష్ణవేణమ్మ కొడుకు వంక చూసింది– 'నీ ఆలోచన అమోఘంరా' అనే అర్థంతో. అతడు నవ్వి ఊరు కొన్నాడు.

"అత్తయ్యోయ్! ఏం పిలిచావు?" అంటూ నీలవేణి వచ్చింది, కృష్ణవేణమ్మ చెప్పింది.

"ఇప్పుడా! అవతల బోలెడంత పని ఉంది. సామానుల కొట్లోంచి పంచదారా, అవీ తీసి ఇవ్వాలి. రాత్రి కుట్టిపెడుదువుగానిలే... ఇప్పుడు జడ అడ్డం వస్తుంది" అని చెప్పి నీలవేణి వెళ్ళిపోయింది.

విశాలాక్షి వచ్చింది. వెంటనే తన జడ విప్పుకొని, కృష్ణవేణమ్మ ముందు కూర్చొంది. సుందరమ్మ 'సాయంత్రం కాఫీలు' కలుపుతున్నదట. అయిపోగానే వస్తానని కబురు పెట్టింది.

ఆ నలుగురి జవాబులూ విన్నాక, వేణు కదిలాడు. సరాసరి సామానుల కొట్లోకి వెళ్ళాడు. నీలవేణి ఒక్కర్తే ఉంది. అతడు నవ్వుతూ, ఆమెకి దగ్గరగా వెళ్ళాడు. అతని చూపులతో ఆమె కరిగిపోయింది. అతడు ఆమె కురులని వేళ్ళతో నిమిరాడు. ఆమె గతుక్కుంది.

అతడు నీలవేణిని చూసి, "ఆ నాగరం ఇచ్చేయ్!" అన్నాడు.

"ఏ నాగరం?" అంది ఆమె కోపంగా.

"అదే!" అని, అతను ఆమె ముచ్చట ముడిని విప్పాడు. నాగరం కింద పడింది. అతడు దానిని తీసుకుని, బయటకు వచ్చాడు. సామానుల గదిలో నీలవేణి వంటరిగా ఉన్నప్పుడు లోనికి తన భర్త ఎందుకు వెళుతున్నాడా అని రుక్కు అక్కడికొచ్చింది. అతడు నాగరం ఆమె చేతిలో పెట్టి "వెళ్ళి, పేరిందేవి పిన్నమ్మకి ఇయ్యి" అన్నాడు.

"ఎలా దొరికింది?" అని రుక్కు అడిగింది.

వేణు చెప్పాడు.

"ఆమె తీసిందని మీకు ఎలా తెలుసు?" అని అడిగింది భార్య.

"నాగరం తీసినవాళ్ళు ఈ ఊరివాళ్ళు కాదనుకొన్నా. వాళ్ళు తీస్తే, ఇవాళ కాకపోతే రేపైనా బయటపడి పోతారు. నీలవేణి బొంబాయి నుంచి వచ్చింది. మళ్ళా బొంబాయికే వెళ్ళిపోతుంది. అందుచేత ఆమె దొంగతనం చేసినా, ఊరెళ్ళాక అది బయటపడడం కల్ల. అందుకే ఆమె తీసి ఉండవచ్చు అనుకొన్నా.

"అదీకాక పెళ్ళి ఫోటోలు చూశాను. ఆ ఫోటోలో నీలవేణి జడ వేసుకొని ఉంది. భుజం మీద నుంచి అది వేళ్ళాడుతూ ఫోటోలో కనిపించింది. అయితే మూడు ముళ్ళూ వేసిన పదిహేను నిమిషాల తరవాత నీలవేణి నాకు ముచ్చట ముడితో కనిపించింది. ఎవరైనా ఇంత స్వల్ప వ్యవధిలో జడని విప్పి, ముడి ఎందుకు వేసుకోవాలని నాకు అనుమానం వేసింది. నా అనుమానం సరైనదని రుజువయింది" అన్నాడు వేణు.

రుక్కు ముక్కుమీద వేలేసుకొంది.

"ఈ సంగతి బయటకు పొక్కనివ్వకు, సరుకు దొరికింది అదే చాలు" అన్నాడ వేణు. రుక్కు కదలింది.

"మాట!" అని పిలిచి, ఆమె చెవిలో అతడు ఏదో చెప్పాడు. ఆమె వెళ్ళిపోయింది.

వెంటనే నీలవేణి వచ్చి, వేణు కాళ్ళమీద పడింది. "నా పరువు కాపాడు. ఎవరికీ చెప్పకు" అని బతిమాలింది.

"నువ్వు ఎలా తీశావో, ఎక్కడ దాచావో నాకు తెలుసుగాని, ఎందుకు తీశావో అర్థం కావడంలేదు" అన్నాడు వేణు.

"ఏం చెప్పను? మా ఆయన పెద్ద ఉద్యోగస్థుడన్న మాటేగాని, గుర్రప్పందాలూ, క్లబ్బులో పేకాటలూ మొదలైన వాటివల్ల అప్పులపాలయ్యాం. పైగా బొంబాయిలో ఇళ్ళబాధలు నీకు తెలుసు. 'పగిడీ' ఇస్తేనేగాని మంచి ఫ్లాట్ దొరకదు. ఈ నాగరం వల్ల మా బాధలు గట్టెక్కుతాయి అనుకొన్నా. వెధవ దొంగతనం చెయ్యకూడదనుకొంటూనే చేశా. నువ్వు నన్ను అనుమానించావని పొద్దుటే కనిపెట్టా. అవకాశం వస్తే ఆ నాగరం ఎక్కడో దొరికిందని బొంకి, ఇచ్చేసి, బొంబాయి పోదామనుకొన్నాను. నా సదుద్దేశం ఆచరణలో పెట్టేలోగా నువ్వు వచ్చి పట్టుకొన్నావు" అంది నీలవేణి.

అతడు అక్కడనుంచి కదిలాడు.

"ఇదిగో పిన్నమ్మా, నాగరం – తెచ్చుకొన్నా!" అంటూ చిన్నమ్మ కృష్ణవేణమ్మ వద్దకు వచ్చింది. ఆమె ఆశ్చర్యపడింది.

"ఎక్కడనుంచి తెచ్చావ్?" అని అడిగింది.

"అదే – పెళ్ళికూతురు జడలోంచి" అంది చిట్టి.

"ఆ! పెళ్ళికూతురు జడలోంచా?" అంది కృష్ణవేణమ్మ.

"అవునమ్మా! అడగ్గానే ఇచ్చారు. రుక్కు వదిన కూడా అక్కడే ఉంది. ఆమే తీసి ఇచ్చింది" అంది చిన్నమ్మ.

నీలవేణి దగ్గర్నుంచి నాగరం తీసుకొన్నదీ; రుక్కుని పెళ్ళికూతురు దగ్గరికి పంపి, చిన్నమ్మకి నాగరం ఇమ్మన్నదీ తన కొడుకే అన్న సంగతి కృష్ణవేణమ్మకు తెలియదు.

ఆమె ముక్కుమీద వేలేసుకొంది. ■